

పునరావృతం కాకుండా చూడాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వైద్య వృత్తిలో ఉన్న మహిళలకే రక్షణ కరువైతే మహిళల్లో అభద్రతాభావం పెరిగే ప్రమాదం ఉంది. మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడాలంటే భయపడేలా నిందితులకు శిక్ష అమలు చేయాలి.

– డాక్టర్ పి.కావ్య, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

మహిళా డాక్టర్లకు భద్రత అవసరం



మహిళా డాక్టర్‌లు రేయింబవళ్లు అత్యవసర కేసులకు హాజరు కావల్సి ఉంటుంది. కోల్‌కతా ఘటన వల్ల మహిళా డాక్టర్‌లు రాత్రి వేళల్లో విధులకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా వైద్యులకు తగిన భద్రత కల్పించడం ద్వారా వారిలో ధైర్యం పెంపొందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

– డాక్టర్ డి.జనార్ధన్, యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి

కఠినంగా శిక్షించాలి



ప్రజల ప్రాణాలను రక్షించే వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సమాజంపై కూడా ఉంది. కోల్‌కతా ఉదంతం జరిగాక దేశమంతా స్పందించింది. మహిళలపై దారుణాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయి.

– ఇ.స్వర్ణలత, స్టాఫ్‌నర్స్, యల్లాయపాళెం పీహెచ్‌సీ



క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో చేపట్టిన ప్రభుత్వ గృహ నిర్మాణాలను ఇంజినీరింగ్ విజిలెన్స్ అధికారులు గురువారం పరిశీలించారు. తొలుత హౌసింగ్ కార్యాలయంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం హౌసింగ్‌కు సంబంధించిన గోదాముల్లో స్టాక్ రిజిష్టర్లను, స్టాక్‌ను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉమ, మాధవ్, సౌఖ్య, తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



అనుమసముద్రంపేట: ప్రభుత్వ గృహాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఏఎస్‌పేట సచివాలయంలో గృహ లబ్ధిదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలన్నారు. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను శ్లాబ్ స్థాయికి చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ వివేక్, పంచాయతీ కార్యదర్శి భరత్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్‌కు వేలం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో దర్గాకు వచ్చే వాహనాల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు హక్కుకు వేలం పాటను గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించారు. మరికొద్ది రోజుల్లో దర్గాలో చిన్నగంధం జరగనున్న నేపథ్యంలో పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది వాహనాల పార్కింగ్‌కు వేలంపాటను సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో పలువురు పోటీపడగా, చివరకు ఏఎస్‌పేటకు చెందిన కాలేషా రూ.2.20లక్షలకు దక్కించుకున్నారు. గురువారం నుంచి నెల రోజుల పాటు పంచాయతీ పరిధిలో వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు వేలంపాట వర్తిస్తుందని పంచాయతీ కార్యదర్శి యస్దాని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిలానీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని బొగ్గేరు సమీపంలో ఉన్న వెంకయ్యస్వామి మందిరంలో ఆరాధన మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వెంకయ్యస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పల్లకిసేవ జరిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

కావలి : అదనపు కట్నం కోసం తనను భర్త, అత్త, మరిదిలు వేధిస్తున్నారని పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కావడి దీప్తి కావలి రెండో పట్టణ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వివరాలు.. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం రాపర్ల గ్రామానికి చెందిన కావడి గోపీచంద్‌తో దీప్తికి 2017లో వివాహమైంది. గోపీచంద్ వివాహానంతరం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను అదనపు కట్నం తీసుకురావాలని దీప్తిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని అత్త, ఇద్దరు మరిదిలకు విన్నవించినా వారు భర్తకే మద్దతుగా ఉండి శారీరకంగా, మానసికంగా తనను హింసిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

అల్లూరు: ఈ నెల 31న సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం ఉద్యోగులకు సెలవు దినం కావడంతో ఒకరోజు ముందే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 31న పింఛన్ తీసుకోనివారికి 2వ తేదీ అందజేస్తామని తెలిపారు.



సోమశిల: వెంగంపల్లి ఉన్నత పాఠశాలలో..



మర్రిపాడు: కేజీబీవీలో..



కలిగిరిలోని ఆదర్శ పాఠశాలలో..



సంగం జడ్పీ హైస్కూల్‌లో..

తెలుగు భాషా వైతాళికుడు గిడుగు



దుత్తలూరు: గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో..



చేజర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో..



ఏఎస్‌పేట: ఎంపీడీఓ కార్యాలయంలో..

దుత్తలూరు: తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, తెలుగు సాహిత్య వైతాళికుడు గిడుగు రామ్మూర్తి అని తహసీల్దార్ వై నాగరాజు కొనియాడారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఓ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

• దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ సింగవరపు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలన్నారు.

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి తహసీల్దార్ ఎం సుభద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ అసిస్టెంట్ సంధాని, సర్వేయరు రవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

జలదంకి: మండల తహసీల్దార్ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి తహసీల్దార్ హేమంత్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీటీ భరత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవాల విశిష్టతను వివరించారు. అనంతరం తెలుగుభాషపై విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు నాగమణి, లీలావలి, భాను ప్రకాష్‌ను సన్మానించారు. పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ మస్తాన్‌వలి, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జయరామిరెడ్డి, అంజాద్, వెంకటసుబ్బయ్య, సుమతి, పీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగుభాషపై వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులతో తెలుగు పద్యాలను వల్లె వేయించారు. ఉపాధ్యాయులు కొత్తపల్లి మధుసూదనశాస్త్రి, వంటేరు మల్లికార్జున, ఫాతిమా మేరీ పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని కొనియాడారు. మండల పరిషత్ ఏఓ శ్రీనివాసరావు, సాంకేతిక సహాయకుడు రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

• కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు , మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం మాలకొండలరావు నివాళులర్పించారు.

సోమశిల: అనంతసాగరం మండలం వెంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగుభాషపై పోటీలు నిర్వహించారు.

మర్రిపాడు: మండలంలోని నందవరంలోని ఆదర్శ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు మామిళ్లపల్లి మంజుల, పార్వతమ్మ, జనార్దన్ తెలుగు భాషా విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు పద్య, పాటలు, వక్తృత్వ, నృత్య, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

• మర్రిపాడు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రత్యేకాధికారిని ఎస్ లక్ష్మీదేవి అధ్యక్షతన తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్రిపాడు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పదో తరగతి విద్యార్థిని ఎస్ సుమశ్రీ తెలుగుతల్లి వేషధారణతో అలరించారు. తెలుగు పద ఆకృతిలో విద్యార్థినులు కూర్చుని మాతృభాషకు వందనం సమర్పించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి డీ నారాయణ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో హెడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ సాయి, హెడ్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: మండల తహసీల్దార్ కార్యాలయంలో గిడుగు చిత్రపటానికి తహసీల్దార్ సోమ్లానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. సంగంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో భాషా దినోత్సవ వేడులకను ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగు పద్యాలు, శ్లోకాలు పాడారు. తెలుగు పండితులు సుబ్బు ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు తెలుగు బాషా గొప్పదనాన్ని వివరించారు. తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చేజర్ల: చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులు తెలు గు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ , హెచ్‌ఎం హైమావతి, పీఈటీ మల్లికార్జున, ఉపా ధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, ఇందుమతి, రాణి, షమీమ్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



సీతారామపురం ఉన్నత పాఠశాలలో..



జలదంకి: తహసీల్దార్ కార్యాలయంలో..



కొండాపురం ఆదర్శపాఠశాలలో..



ఆత్మకూరు: సెయింట్ మేరీస్ పాఠశాలలో..



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో..

వివాదాస్పద స్థల పరిశీలన

దుత్తలూరు: మండలంలోని కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలో సర్వే నంబర్ 1026–3లో ఉన్న వివాదాస్పద స్థలాన్ని తహసీల్దార్ వై నాగరాజు గురువారం పరిశీలించారు. ఇటీవల వివాదాస్పద స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాలనీవాసులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. వివాదాస్పద స్థలంలోకి ఎవరైనా వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్లను వెంటనే రద్దు చేసి బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆశ కార్యకర్తల ఆందోళన



కలిగిరి: రావులకొల్లు ఆశ కార్యకర్త పందిటి విజయమ్మను విధుల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ మండలంలోని ఆశ కార్యకర్తలు కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆందోళనను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. విజయమ్మ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని, స్థానిక టీడీపీ నేతలు అకారణంగా ఆమెను విధుల నుంచి తొలగించేలా చేశారన్నారు. విధుల్లో చేర్చుకునేంత వరకు ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. కాగా ఆందోళన సమయంలో విజయమ్మ సొమ్మసిల్లడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.

బాధితులకు అండగా ఉంటాం

ఆత్మకూరు: పట్టణంలోని కొలగానిరామయ్య సత్రం బాధితులకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని చింతచెట్లకాలనీ ప్రాంతం కొలగాని రామయ్య సత్రం భూమిగా పేర్కొంటూ అక్కడ ఏడు దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు మంత్రి ఆనం ఆదేశాలతో దేవాదాయ శాఖ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చింతచెట్ల కాలనీవాసులతో సీపీఎం నాయకులు గురువారం సమావేశమయ్యారు. సీపీఎం నాయకుడు డేవిడ్ రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మీపతి, తదితరులు మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా కాలనీలో ఉంటున్న పేదలు తమ ఇళ్లకు పన్నులు కడుతున్నారన్నారు. విద్యుత్ శాఖ కనెక్షన్లు సైతం ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు వెంటనే ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడం, కొందరికి నోటీసులు ఇవ్వడం సరి కాదన్నారు. తమ పార్టీ పేదలకు అండగా ఉండి పోరాడుతుందని, అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని పోరాటం సాగిస్తామన్నారు. పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ, ఎం నాగేంద్ర, నజీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



కావలి: పొట్టిశ్రీరాములు పాఠశాలలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం



ఉదయగిరి: వ్యవసాయ కళాశాలలో ధ్యాన్‌చంద్‌కు నివాళి



సంగంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు:మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్లు



చేజర్లలోని ప్రభుత్వ కళాశాలలో ఆటల పోటీలు

ఆత్మకూరు: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని ఎస్‌ఆర్‌జే డిగ్రీ కళాశాల పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్సార్‌జే డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, పుల్లయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్

కావలి : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం 2కే రన్ నిర్వహించారు. పదో ఆంధ్ర నావెల్ యూనిట్ నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోదంగవే ఆదేశాల మేరకు రన్ ఫర్ ఫిట్ కార్యక్రమం లో భాగంగా చేపట్టిన ఈ 2కె రన్‌ను ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హయ్యూల్ హయ్యూమ్ జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల నుంచి ఆరు రోడ్ల కూడలి, ఎమ్మెస్సార్ విగ్రహం, పీహెచ్‌సీ, ఎఫ్‌సీఐ గోదాముల మీదుగా 2కే రన్ సాగింది. ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర అధ్యాపకులు అంజాద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యానికి ప్రతిరోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు కాసేపు ఆటలు ఆడారు. ఎన్‌ఎస్ఎస్ ఆఫీసర్ పుల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి మెయిన్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతిరోజూ నడక ఆరోగ్యానికి ప్రతీక అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ పాల్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాలీబాల్, టెన్నిస్, చెస్, బాస్కెట్‌బాల్, తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఎస్సైకు సన్మానం

అనుమసముద్రంపేట: మండల నూతన ఎస్సై సైదులును సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు షేక్ ఖాదర్‌వలి, సయ్యద్ మషూద్, వై వెంకటేశ్వర్లు, అస్గర్, యస్దాన్, శేషారెడ్డి తదితరులు ఉన్నారు.

వేళాంగిణి మాత ఉత్సవాలు ప్రారంభం

సీతారామపురం : స్థానిక ఎస్సీ కాలనీలోని చర్చిలో వేళాంగిణి మాత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆత్మకూరుకు చెందిన ఫాదర్ బాలశౌరిరెడ్డి సమష్టి దివ్యబలి సమర్పించారు. అనంతరం పతాకావిష్కరణ చేసి మతగురువులు ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు బైబిల్ సందేశాన్ని వినిపించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపించిన సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. వచ్చే నెల 7వ తేదీ వరకు నవదిన ప్రార్థనలు నిర్వహించనున్నారు. 8న వేళాంగిణి మాత తేరు ప్రదక్షిణతో మహోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీతారామపురం, మారంరెడ్డిపల్లి చర్చిల విచారణ గురువులు మందా సునీల్‌కుమార్, డేవిడ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి కేటాయించిన స్థల పరిశీలన



ఇసుక డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురంలో పీహెచ్‌సీ నిర్మాణానికి సెప్టెంబరు1న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన 1.5 ఎకరాల స్థలాన్ని ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు పీహెచ్‌సీ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని తాము శ్మశానంగా వినియోగించుకుంటున్నామని ఆర్డీఓ దృష్టికి తీసుకురాగా సుసమస్యను సున్నితంగా పరిష్కరించారు. గ్రామస్తుల విన్నపం మేరకు 25 సెంట్ల స్థలాన్ని శ్మశానానికి కేటాయించి హద్దులు సైతం ఏర్పాటు చేసి అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ స్వప్న, ఆర్‌ఐ సురేంద్ర , తదితరులు ఉన్నారు.

ఇసుక డంపింగ్ యార్డు పరిశీలన

మర్రిపాడులోని ఇసుక డంపింగ్ యార్డును ఆర్డీఓ మధులత పరిశీలించారు. ప్రస్తుతం యార్డులో ఎంత మేర ఇసుక నిల్వలు ఉన్నాయి..ఇప్పటి వరకు ఎన్ని టన్నులు బుకింగ్ చేసుకున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వారికి సూచించారు.

ఇసుక లేక.. నిర్మాణాలు సాగక

• భవన నిర్మాణ కార్మికుల గగ్గోలు



పనుల కోసం వేచిచూస్తున్న కార్మికులు

కావలి: పట్టణానికి పెన్నా నది ఇసుక రెండు వారాలుగా రావడం లేదు. దీంతో భవన నిర్మాణ పనులు ముందుకు సాగక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పనులు దొరక్క భవన నిర్మాణ కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. పట్టణంలో భవన నిర్మాణ పనులపై ఆధారపడి కావలితో పాటు చుట్టపక్కల గ్రామాలకు చెందిన సుమారు 2500 మందికిపైగా కూలీలు పనిచేస్తుంటారు. కొందరు ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకుని కూలి పనులకు వెళ్తుంటారు. మరికొందరు సినిమాహాలు రోడ్డుకు ఉదయాన్నే చేరుకుని ఏ రోజుకు ఆ రోజు అవసరమైన వారికి కూలి పనికి వెళ్తుంటారు. అయితే రెండు వారాలుగా పట్టణానికి ఇసుక రాకపోవడంతో నిర్మాణ పనులు సాగడం లేదు. ఈ విషయం తెలుసుకున్న పట్టణంలోని కూలీలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. గ్రామీణ ప్రాంత కూలీలు మాత్రం యథాప్రకారం పట్టణానికి చేరుకుని సినిమాహాలు రోడ్డులో వేచిచూస్తున్నారు. ఎవరైనా పనికి పిలుస్తారేమోనన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎవరూ పిలవకపోతుండడంతో ఉసూరుమంటూ తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. కావలికి రెండు వారాల నుంచి ఇసుక ఎందుకు రావడం లేదో,..ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియడం లేదు. భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతుండగా, భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో చేసిన పనుల్లో నష్టం జరుగుతుందనే ఆందోళనను భవన నిర్మాణదారులు వ్యక్తం చేస్తున్నారు.

పనులు దొరకడం లేదు



ఇసుక కొరతతో 15 రోజులుగా కావలిలో భవన నిర్మాణ పనులు సాగడం లేదు. ప్రతిరోజూ కావలికి వస్తున్నా పనులు దొరక్క ఉత్త చేతులతోనే ఇంటికి వెళ్తున్నా. బస్సు చార్జీలు, ఖర్చులకు డబ్బులు అయిపోవడం తప్ప ప్రయోజనం ఏమీ లేదు.

–వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మికుడు, బిట్రగుంట